క్లుప్తంగా

అనంతపల్లిలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న భక్తులు

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ప్రాంగణంలో బుధవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే ఆలయ ప్రాంగణంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నాగులపుట్ట ప్రతిష్ఠ, నాగబంధం ప్రతిష్ఠ వేడుకలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదపూడి విజయ వెంకటరమణ, వాడపల్లి శశికాంత్ ఆచార్యుల ఆధ్వర్యంలో వివిధ రకాల క్రతువులు జరిగాయి. శాంతి కల్యాణం జరిపారు. అనంతరం బుధవారం మధ్యాహ్నం సుమారు ఆరు వేల మందికి అన్న సంతర్పణ చేశారు. బంధువుల రాకతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆలయం వద్ద తిరునాళ్ల వాతావరణం తలపింప జేసింది. వాడపల్లి ఆలయం మాదిరిగా ఏడు వారాల యంత్రాన్ని ప్రతిష్ఠించారు.

వెలగదుర్రులో స్వామివారి ఆవిర్భావ దినోత్సవం



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

ఉండ్రాజవరం: వెలగదుర్రు గ్రామంలో కొలువైన అలివేలు మంగ, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేదుల వెంకటరమణ, శ్రీనివాసులు, త్రినాథ్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వేదమంత్రాలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను తులసీ దళాలు, పూలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏకాహం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రోగులకు 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: గ్రామానికి చెందిన ఐనం కొండయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచంపై ఉంటూ చికిత్స పొందుతున్నాడు. అతనికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ బుధవారం రూ.6 వేల ఆర్థిక సాయం చేసింది. అలాగే మార్లెమూడిలో పెనుమాక సుబ్బారావు అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి రూ.4వేల ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, రీజియన్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ, సుంకవల్లి శ్రీను, ఎట్టి రామకృష్ణ, ప్రగడ శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

50 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన సారా, నిందితులతో పోలీసులు

గోపాలపురం: జగన్నాథపురం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 50 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటకు చెందిన ఇద్దరు మోటార్ సైకిల్‌పై ఈ సారాను తరలిస్తుండగా చెక్ పోస్టు తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. సారాను, బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరు వ్యక్తులనూ అరెస్ట్ చేసినట్టు ఎస్సై వివరించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై సత్యనారాయణ, ఎస్ఈబీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నట్టు చెప్పారు.

వంతెన పరిసరాల్లో ఇసుక తవ్వకాలు జరపొద్దు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వంతెన పరిసర ప్రాంతాల పరిధిలో 500 మీటర్ల దూరం వరకు ఎటువంటి ఇసుక తవ్వకాలు నిర్వహించకూడదని, జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. బుధవారం ఆమె ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. గోదావరి వంతెనలకు 500 మీటర్ల దూరం గుర్తించే ప్రక్రియలో భాగంగా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్ ఎస్ఈబీ, రెవెన్యూ, జల వనరులు, గనులు–భూగర్భ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో బీ1 కేటగిరి కింద 10 ఇసుక రీచులకు పర్యావరణ అనుమతుల కోసం ఆమోదం తెలిపిందన్నారు.



అన్నవరప్పాడు సచివాలయానికి వచ్చిన వికలాంగుడికి పింఛను అందిస్తున్న సచివాలయ ఉద్యోగి



అన్నవరప్పాడు సచివాలయానికి పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు



నిడదవోలు రాయిపేట సచివాలయంలో పింఛన్ల కోసం క్యూలో లబ్ధిదారులు



నిడదవోలులో దివ్యాంగ పింఛనుదారుతో తల్లి

మండుటెండలో పండుటాకులు

- పింఛన్ల కోసం సచివాలయాల వద్ద అవ్వాతాతల అవస్థలు
- కొన్నిచోట్ల మధ్యాహ్నం, కొన్నిచోట్ల సాయంత్రం నుంచి పంపిణీ ప్రారంభం
- చంద్రబాబును తిట్టుకున్న లబ్ధిదారులు

పెరవలి: ప్రతి నెలా ఒకటో తేదీనే కోడికూయక ముందే వలంటీర్లు ఇంటికి వచ్చి, తలుపు తట్టి, ఆప్యాయంగా పలకరించి అవ్వాతాతలకు పింఛను అందించే వారు. కానీ తెలుగుదేశం పార్టీ చేసిన కుట్ర వల్ల పరిస్థితి తారుమారైంది. ముసలీ, ముతకా కాళ్లీడ్చుకుండా సచివాలయానికి వెళ్లి తమ వంతు ఎప్పుడొస్తుందా? అని పడిగాపులు కాయాల్సిన రోజులొచ్చాయి. దాంతో పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ నెల పింఛన్ల పంపిణీ బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సచివాలయం వద్ద ఈ పంపిణీ చేపట్టారు. దాంతో లబోదిబోమంటూ వృద్ధులు, వికలాంగులు ఎండకు ఎండుతూ సచివాలయానికి చేరుకుని ఆపసోపాలు పడ్డారు. సిబ్బంది దగ్గరకు లైన్‌లో నిలబడి వెళ్లి పింఛను తీసుకునేందుకు వారు ఇబ్బందులు పడ్డారు. వయసు మళ్లిన లబ్ధిదారులు నిలబడలేక, నడవలేక, మెట్లు ఎక్కలేక అవస్థలు పడ్డారు. పెరవలి మండలంలో 10,514 మంది లబ్ధిదారులు ఉండగా, వారికి రూ.3.07 కోట్లు పింఛన్‌గా పంపిణీ చేయవలసి ఉంది. వారిలో వికలాంగులకు రూ.5 వేల చొప్పున, మిగిలిన వారికి రూ.3 వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ నెల ఆరో తేదీ వరకూ ఈ పంపిణీ కొనసాగుతుంది.



దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

దేవరపల్లి మండలంలో తొలి రోజు 70 శాతం

దేవరపల్లి: మండలంలో తొలి రోజు బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకూ సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేపట్టారు. గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ జరుగుతుందని అధికారులు ముందుగానే ప్రచారం చేయడంతో బుధవారం ఉదయం 9 గంటలకే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అక్కడకు చేరుకున్నారు. బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేయడానికి సమయం పట్టడంతో మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టారు. తొలిరోజు 70 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి అడ్డుకున్న టీడీపీ నేతలపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిడదవోలులో మధ్యాహ్నం నుంచి..

నిడదవోలు: పట్టణంలోని 13 వార్డు సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండుటెండలో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు కిందా మీద పడుతూ సచివాలయాలకు వచ్చారు. అక్కడ వారికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. సచివాలయానికి వెళ్లడానికి ఆరోగ్యం సహకరించపోయినా ఉన్న శక్తిని కూడగట్టుకుని గడప దాటాల్సిన పరిస్థితి మాకు దాపురించిందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై చంద్రబాబుకు ఎందుకు ఇంత కక్ష అని వాపోతున్నారు. పలువురు దివ్యాంగ చిన్నారులను పెన్షన్ కోసం తల్లులు మోసుకుంటూ సచివాలయాలకు చేరుకున్నారు.

చాగల్లు: పింఛన్ల కోసం తొలిరోజు బుధవారం మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద ఉదయం నుంచి లబ్ధిదారులు బారులు తీరారు. కొన్ని సచివాలయాల్లో మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. మరికొన్ని సచివాలయాల్లో సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించి, రాత్రి వరకూ పంపిణీ చేస్తూనే ఉన్నారు. వృద్ధులు, వికలాంగులు ఎండలో సచివాలయాలకు రాలేక తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో 9617 మంది పెన్షన్‌దారులకు గాను తొలి రోజు 3155 మందికి పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. తొలి రోజు 32.81 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

నేడు తాళ్లపూడిలో 'తలారి' ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రెండో రోజు తాళ్లపూడి గ్రామంలో ప్రజాశీర్వాదం పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. కావున నియోజకవర్గ పరిధిలోని పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఉండ్రాజవరం: ప్రస్తుత రబీ సీజన్‌లో పండించిన ధాన్యం సేకరణకు మండలంలో గురువారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.విశ్వాసరావు బుధవారం తెలిపారు. మండలంలో 11 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ఎంటీయూ 1121 రకం వంగడాన్ని అధికంగా సాగు చేశారని ఆయన వివరించారు. ధాన్యం కొనుగోలు కోసం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మైత్రీ సంఘాలను, టోల్ ఫ్రీ నంబర్‌ను, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణకు మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఏవోల సారథ్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే 50 శాతం గోనె సంచులను రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు.

5న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల, కోరుమామిడి విద్యుత్తు సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మధ్యలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీ రఘద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమళ్ల, కోరుమామిడి, అమ్మేపల్లి, చిక్కాల గ్రామాల వ్యవసాయ విద్యుత్తు కనెక్షలకు త్రీ ఫేజ్ విద్యుత్తును ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పథకాల డోర్ డెలివరీ ఘనత జగన్‌దే



ప్రజాశీర్వాద యాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- రాజీవ్‌కృష్ణతో తాళ్లపూడిలో ప్రజాశీర్వాద యాత్ర

తాళ్లపూడి: సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ చేయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. ఆ పార్టీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఆయన మండల కేంద్రమైన తాళ్లపూడిలో ప్రజాశీర్వాద యాత్ర పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ కూడా పాల్గొన్నారు. వారందరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన పలు సమస్యలను సావధానంగా విని, వాటిని తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రజకులపేటలో దుస్తులు ఇస్త్రీ చేసి అక్కడి వారిని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ జగన్ అందించినట్టుగా రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలను అందజేయలేదన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మనకు మళ్లీ కావాలంటే, ఈ ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.ఈ ప్రచారంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు నక్కా చిట్టిబాబు, గూడా విజయరాజు, కోదాటి కనకయ్య, కుంటముక్కల కేశవనారాయణ, పిట్టా శ్రీనివాస్, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, మైగాపుల ఆంజనేయులు, వంబోలు పోశిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో సమావేశం

ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్ కృష్ణలు ఆ పార్టీ స్థానిక నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన పలు విషయాలను వారితో చర్చించారు. నాయకులందరు కలసికట్టుగా పని చేయాలని సూచించారు.

అందరి మంచి కోరే జగన్‌నే ఆదరించండి

- హోం మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి తానేటి వనిత
- ఘంటావారిగూడెంలో ఇంటింటా ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న హోం మంత్రి, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

నల్లజర్ల: కులమతాలు, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మంచినీ కోరే జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఘంటావారిగూడెంలో బుధవారం రెండో రోజు ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇమ్మణ్ణి సత్తిపండు, ఎంపీటీసీ సభ్యురాలు యలమర్తి సూర్యకుమారి, పార్టీ నాయకులు యలమర్తి వాసు, ఈలప్రోలు చంద్రరావు ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ జగనన్న మళ్లీ సీఎం అయితే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందుతాయన్నారు. టీడీపీ మాత్రం అధికారంలోకి వస్తే గతంలో మాదిరి జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తాయన్నారు. ఇంటి వద్దే పెన్షన్ తీసుకుంటే అవ్వా తాతలు, వికలాంగులు, వితంతువులు జగన్‌కే ఓట్లేస్తారనే ఉద్దేశంతో కుట్ర చేసి చంద్రబాబు నాయుడు దానిని కూడా అడ్డుకున్నారని విమర్శించారు. టీడీపీకి పొరపాటున మళ్లీ ఓటు వేస్తే తిరిగి చీకటి రోజులు తప్పవని ఆమె గుర్తు చేశారు. అందరికీ మేలు చేసే జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా ఎమ్మెల్యేగా తనను, రాజమహేంద్రవరం ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా లక్ష్మి, పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఆచంట అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, వార్డు సభ్యులు, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

కొవ్వూరు: బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా యాగంటి చలపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా తక్కెళ్ల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా మర్రి వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా యదాటి ప్రకాష్, కోశాధికారిగా వి.రాజా వరప్రసాద్, మహిళా ప్రతినిధిగా సి.తారాకుమారి, స్పోర్ట్స్ కార్యదర్శిగా పి.హరీష్, లైబ్రరీ కార్యదర్శిగా అరవింద్ ప్రమాణ స్వీకారం చేశారు. న్యాయమూర్తులు శ్రీనివాసరావు, ధర్మరాజు, సాయికృష్ణలతో పాటు పలువురు న్యాయవాదులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం వద్ద హైవే సర్వీస్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. దేవరపల్లి నుంచి మలకపల్లి బైక్‌పై వెళుతున్న ఆ యువకుడు గౌరీపట్నం వద్ద హైవే సర్వీస్ రోడ్డుపై గల ధాన్యం గుట్టలను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడితో పాటు ఏడాది వయసున్న పాప తీవ్రంగా గాయపడింది. వారిని రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



గోపాలపురం ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

గోపాలపురం: ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని నిరసిస్తూ మండలంలో పని చేస్తున్న గ్రామ వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.రమేస్‌బాబుకు అందజేశారు. గోపాలపురం, కోమటికుంట, వాదాలకుంట గ్రామాలకు చెందిన సుమారు 40 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయనకు అందజేశారు. ఇప్పటివరకూ ఇంటింటికీ పింఛన్లు, రేషన్ పంపిణీ చేసిన తమను ఇప్పుడు ఆ విధులకు దూరం పెడుతూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామాలు చేస్తున్నట్టు వలంటీర్లు పేర్కొన్నారు.

మలకపల్లిలో 12 మంది..

తాళ్లపూడి: ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను నిరసిస్తూ మండలంలోని మలకపల్లి పంచాయతీ పరిధిలోని 12 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. వారందరూ బుధవారం తాళ్లపూడి వచ్చి తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటరమణకు అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమకు గౌరవ వేతనం ఇచ్చి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిందని వారు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ తమ తాబేదారులతో కుట్రతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, తమను పింఛన్ల పంపిణీ వంటి విధులకు దూరంగా ఉంచినందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వలంటీర్లు పేర్కొన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లలో గణేష్, గెడ్డం నాగమణి, సీతారత్నం, అజయ్‌బాబు, సరిత, పోశి రాంబాబు, చిన్ని, హేమలత ఉన్నారు.

నిడదవోలులో 13 మంది ..

నిడదవోలు: పట్టణంలో పనిచేస్తున్న 13 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న కుటిల రాజకీయాల వల్ల తమకు అభాగ్యులకు సేవ చేసే అవకాశం లేకుండా పోయిందని పలువురు వలంటీర్లు వాపోయారు. ఆ 13 మందీ తమ రాజీనామా లేఖలను మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా చేసిన వారిలో గెడ్డం మమత, మేరా సాహెబ్, షేక్ మొహిద్దీన్, వి. అరుణ, వి. సౌజన్య, జి. దుర్గాభవాని, కె. అపర్ణ, కార్తీ బిందు, భార్గవి, కోనేటి ప్రియదర్శిని, ఎం సంధ్యాదేవి, జి. నవ్య, పి నాగవల్లిక ఉన్నారు.

సంక్షేమ సారథికి జనం జేజేలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరితో కలసి కోరుమామిడిలో ప్రచారం

నిడదవోలు రూరల్: అర్హులకు సంక్షేమ పథకాలు, అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేర్చడంతో ప్రజలంతా ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పాలనకు జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కోరుమామిడి గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులందరూ జగన్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు అపూర్వంగా మద్దతు పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ కోరుమామిడి గ్రామంలో ఇళ్లస్థలాల పంపిణీని అడ్డుకున్న టీడీపీ నాయకులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పెన్షన్లు తీసుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఉసురు చంద్రబాబుకు తగలక తప్పదన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధికి, మీ ఇంట్లో జరిగిన మంచిని గుర్తుపెట్టుకుని ఈ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారాల్లో ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచ్ అంబటి గోపమ్మ, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, సొసైటీ అధ్యక్షులు వింతా గంగాధర్‌రెడ్డి, యాళ్ల రామారావు, జేసీఎస్ మండల అధ్యక్షుడు వెలగన పోలయ్య, పార్టీ నాయకులు కానుబోయిన శేషు, రాపాక వెంకట్రావు, పెద్దిరాజు, జొన్నకూటి బాబూరావు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

30 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై కోరుమామిడి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ నాయకులు సరిదే భారతీకృష్ణ, కాసాని వెంకట్రావు, సర్రయ్య, తానింకి వెంకట్రావు, పడమటి సూర్యారావు, అంజియ్యతో పాటు పార్టీలో చేరిన మరో 25 మంది నాయకులకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

28వ వార్డులో 15 మంది..

నిడదవోలు: పట్టణంలోని 28వ వార్డులో కౌన్సిలర్ ఆకుల ముకుందరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 15 మంది కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయుడి గెలుపునకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, నాయకులు వల్లూరి వెంకటేశ్వరరావు, చాగంటి సూర్యనారాయణ, పడాల రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కోరుమామిడిలో వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్



రథంపై నుంచి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు



నిడదవోలు 28వ వార్డులో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ